# మంగంపేటలో బైరైటీస్ ఎగుమతులు నిలిపివేత



**రైల్వే కోడూరు/ఓబులవారిపల్లె (సూర్య వాస్తవం):** రైల్వే కోడూరు నియోజక వర్గం ఓబులవారిపల్లె మండలం మంగంపేట ముగ్గురాయి గనుల్లో విక్రయాలు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని, అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు సిపిఓ సుందర్శన్‌రెడ్డి నిలిపి వేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి దినం గనిలో తవ్వకాలు కొనసాగుతున్నాయని, ముగ్గురాయిని వెలికి తీసి రాయిని నిల్వ చేస్తున్నామని సుదర్శన్ రెడ్డి తెలిపారు.ప్రస్తుతం బైరైటీస్ గనుల్లో నిలువ చేసిన మొత్తం ఏగ్రేడ్ 45 టన్నులు,బి గ్రేడ్ 95 వేల టన్నులు,సి గ్రేడ్ 79 లక్షల టన్నులు నిల్వ చేసి ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు జరిగాయని అపోహలు ఉన్నాయి.వాటిపై చర్చించేందుకే నిలుపుదల కారణమైందని కొందరు స్థానికుల అభిప్రాయం.

Truth of News

సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

రాయలసీమ జిల్లాలు

బుధవారం | 26 జూన్ 2024 | పేజీలు 8

## సమాజాభివృద్ధిలో జర్నలిస్టుదే కీలకపాత్ర

**-జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి**

**- జర్నలిస్టు పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలి**

**-రూ.10లక్షల ప్రమాద బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలి.**

**- జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలి**

**ప్రత్యేక ప్రతినిధి సూర్య వాస్తవం:** అనునిత్యం ప్రజల మధ్యలో ఉండి నిస్వార్ధంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మార్గ నిర్దేశం చేసి రాష్ట్రంలోనీ ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడానికి కృషి చేస్తున్న అన్ని రంగాల జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలి అని సూర్య వాస్తవం పత్రిక ప్రత్యేక ప్రతినిధి ఎన్. ఆరిఫ్ అలీ అన్నారు. అర్హులైన జర్నలిస్టు అందరికీ మాస, పక్ష, వార పత్రికల సంపాదకులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడేషన్ మంజూరు చేయాలి.జర్నలిస్టులందరికీ రూ.10లక్షల ప్రమాద బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలి. అలాగే జర్నలిస్టుల వెల్ఫేర్ కమిటీని, జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీని, తక్షణమే పునరుద్ధరించాలి. తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న అకాల మరణం పొందిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు అందిస్తున్న పెన్షన్ స్కీమ్‌ను రాష్ట్రంలోనూ అమలు చేయాలి. 20 ఏళ్లకు పైగా జర్నలిస్టుగా పనిచేసిన వారికి రూ.10వేల చొప్పున పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసి జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని, తెలుగు రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణ పథకం కింద పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి . జర్నలిస్టుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలి. ఈ పేర్కొన్న అంశాలు కొత్త ప్రభుత్వం దృష్టి సారిస్తే ఆచరణ సాధ్యమే. ఏది ఏమైనా ప్రభుత్వం పాత్రికేయులపై దయతలిచి న్యాయమైన కోరికలను నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని జర్నలిస్టుల కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.



**ఎన్.ఆరిఫ్ అలీ**

ప్రత్యేక ప్రతినిధి

సూర్య వాస్తవం దినపత్రిక



## కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న

# ఆశలు నెరవేరుస్తాం..

-సంక్షేమానికి పెద్దపీట వేసి..అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

-ఐదేళ్ల వైసీపీ పాలన ఓ పీడకల...ఎక్కడ చూసినా అవినీతే

-రైతుల పాసుపుస్తకాలపై జగన్ ఫోటో తొలగించి..రాజముద్ర వేసి ఇస్తాం

-ప్రత్యేక ప్రణాళికతో కుప్పాన్ని దేశంలో మోడల్ నియోజకవర్గం చేస్తా

**- కుప్పం బహిరంగ సభలో సీఎం చంద్రబాబు**

వివరాలు 2లో





## వాలంటీర్లకు ఇచ్చిన మాట తప్పుతారా?

**-వాలంటీర్ వ్యవస్థకు మంగళం పాడినట్లేనా?**

**-వాలంటీర్ వ్యవస్థపై వేటు తప్పదా!**

**కడప బ్యూరో సూర్య వాస్తవం:** ఎన్నికల్లో వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చెప్పిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేగాక వాలంటీర్ వ్యవస్థకే మంగళం పాడుతారనే అనుమానాలకు మిగతా 2లో





## డయేరియా నియంత్రణపై అప్రమత్తగా ఉండాలి : కడప కమిషనర్

**కడప బ్యూరో సూర్య వాస్తవం:** డయేరియా నియంత్రణపై అప్రమత్తగా ఉండాలి: కడప కమిషనర్ జి.సూర్య సాయిప్రవీణ్‌చంద్ సూచించారు. కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ ప్రజా సమస్యలను పరిష్కరించు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమమును కడప నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నగరపాలక శాఖధిపతులు, సిబ్బందితో కలిసి నిర్వహించారు. అందులో భాగంగా కమిషనర్ మాట్లాడుతూ డయేరియా నియంత్రణపై అప్రమత్తగా ఉండాలని ప్రజలకు చైతన్యం చేయాలని మిగతా 2లో

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
బుధవారం
26 జూన్ 2024

## కార్యకర్తలకు అండగా ఉంటాం : వైఎస్ భారతి రెడ్డి



**సిద్దవటం సూర్య వాస్తవం:** వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి, వైఎస్ భారతి రెడ్డిని భరోసా ఇచ్చినట్లు సిద్దవటం వైసీపీ నేతలు కనకాల నరసింహారావు, జ్యోతి సర్పంచ్ ప్రతినిధి రవిశంకర్ రెడ్డి లు తెలిపారు. పులివెందులలో వైఎస్ భారతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధైర్య పడవద్దని పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె పిలుపు ఇచ్చినట్లు వారు తెలిపారు.

## అభివృద్ధి పనులకు స్థానిక సంస్థలు అడ్డంకి కారాదు : మాజీ డిప్యూటీ మేయర్ అరిపుల్లా



**కడప సూర్య వాస్తవం:** మునిసిపల్ నగరాలలో కానీ, గ్రామాలలో కానీ కొన్ని అభివృద్ధి పనులు చెయ్యాలంటే వాటి తీర్మానాలు అవసరం అవుతాయి కావున స్థానిక సంస్థ లలో పాలకవర్గాలు ప్రతిపక్ష పార్టీ ల ఆధ్వర్యంలో ఉండడం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు ఉంటాయి కాబట్టి ఇటువంటి పరిస్థితులను రానివ్వకూడదు. కావున అభివృద్ధి జరగాలంటే స్థానిక సంస్థలు కూడా సహకరించాలని మాజీ డిప్యూటీ మేయర్ అన్నారు. ఈరోజు కడపలో విలేకరుల తో మాట్లాడుతూ గతంలో అప్రజాస్వామికంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినవి కాబట్టి అభివృద్ధి కి ఆటంకం కలగకూడదు కాబట్టి ప్రభుత్వం చొరవ తీసుకుని విచక్షణాధికారాన్ని ఉపయోగించి స్థానిక సంస్థల పాలకవర్గాలను రద్దు చేసి ఎన్నికలు నిర్వహించడం సమంజసంగా ఉంటుందని అరిపుల్లా అన్నారు.

## వైసీపీ గెలుపు కోసం ప్రవీణ్ కృషి చేసింది నిజం కాదా - నల్లబోతుల నాగరాజు

**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** వైసీపీ గెలుపు కోసం ప్రవీణ్ కృషి చేసింది నిజం కాదా అని టిడిపి నాయకులు నల్లబోతుల నాగరాజు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రవీణ్ ఏ పార్టీకి పనిచేశారో, ఆయన వర్గంలోని అందరిని ఎందుకు వైసీపీలోకి పంపించావో టిడిపి రాష్ట్ర నాయకులు అంత గమనిస్తున్నారన్నారు. ఎన్నికల జరిగే ఒక నెల కూడా కాలేదు ఇప్పుడే తానే ఇన్చార్జ్ అయినట్లు అధికారంతో అందరిని బెదిరిస్తూ మాట్లాడడం మంచిది కాదన్నారు. గతంలో జరిగిన అన్ని సర్వేల్లో పెద్దాయన పేరే ఎక్కువగా రావడంతో పెద్దాయనకు పదవి, టికెట్ ఇచ్చారని ప్రజలు కూడా వరదరాజుల రెడ్డికే మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించారన్నారు. టికెట్టు రాలేదని కక్షతో ఆయన దగ్గర ఉన్న వర్గం అంత వైసీపీలో చేర్పించావన్నారు. ఎన్నికల్లో కూడా వైసీపీకే ఓట్లు వేయాలని ప్రజల అందరికీ చెప్పి ఓట్లు వేయించావన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి టిడిపిలో ఎప్పటికీ మంచి ఆదరణ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లోకేష్ కూడా కక్ష సాధింపు చర్యలు ఏవి వద్దని ఎక్కువగా ఎవరూ మాట్లాడవద్దని తెలిపారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని, ప్రవీణ్ కూడా ప్రచారం చేశారని, అందుకు తగ్గ ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ బాబు, టిడిపి నేతలు, కార్యకర్తలు కష్టపడి పార్టీని గెలిపించి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టారన్నారు. పార్టీ కోసం ప్రతి ఒక్క కార్యకర్త పనిచేశారన్నారు. ప్రవీణ్ పార్టీ కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. అధికారులపై ఇలాంటి బెదిరింపులు పనికిరావన్నారు. ఆయన మీద పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రొద్దుటూరులో తెలుగుదేశం పార్టీని నష్టపరచకుండా ప్రజలందరికీ సేవ చేసే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ హౌసింగ్ బోర్డ్ మెంబర్ కామిశెట్టి బాబు, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, టిడిపి నాయకులు సత్యనారాయణ, బాబు, జనసేన నాయకులు సుంకర మురళి పాల్గొన్నారు.




# కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేరుస్తాం

**కుప్పం, సూర్య వాస్తవం:** కుప్పం రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేసి...అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నాటి వైసీపీ ప్రభుత్వం రూ.10 ఇచ్చి ప్రజల నుండి రూ.100 దోచిందని...తమ ప్రభుత్వం రూ.15 ఇచ్చి...రూ.100 సంపాదించే మార్గం చూపుతుందని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా, పేదరికం లేని సమాజం సాధించేలా పాలన అందిదస్తామని ముఖ్యమంత్రి అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సీఎం మొదటి రోజు శాంతిపురం మండలం, చిన్నారిదొడ్డి వద్ద హంద్రీనీవా సుజల శ్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ ను పరిశీలించారు. అనంతరం కుప్పంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...."నేను 9వ సార్లు ఎమ్మెల్యే అయితే...రూ.8 సార్లు కుప్పం నుండే విజయం సాధించాను. అన్ని ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీతో కుప్పం ప్రజలు నన్ను గెలపించారు. నామినేషన్ కు నేను రాకపోయినా మీరే నా తరపున వేశారు. మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దు బిడ్డగానే పుడతాను. 164 మంది ఎమ్మెల్యేలతో కూటమి గెలిచింది....వైసీపీని చిత్తుగా ఓడించారు. ప్రజాస్వామ్యంలో విర్రవీగితే వైసీపీకి పట్టిన గతే ఎవరైనా పడుతుంది. చిత్తూరు పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలకు 7 స్థానాలను ప్రజలు గెలిపించారు. 20 పార్లమెంట్లలో 7కు 7 స్థానాలు గెలివడం ఒక చరిత్ర. 21 పార్లమెంట్ స్థానాలు కూటమికి ఇచ్చారు. వైసీపీ ఒక అరాచక పార్టీ. దాన్ని ఇంటికి పంపడానికి టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుకట్టాయి. ఈ ఎన్నికల ద్వారా రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తిరిగరాయబోతున్నాం. నేను చేపట్టబోయే ఏ కార్యక్రమాన్ని అయినా ఇక్కడే ప్రయోగించి...ఆ తర్వాత రాష్ట్రంలో అమలు చేస్తా." అని సీఎం అన్నారు.

### వెనకబడిన వర్గాలే నా సామాజికవర్గం

మొన్నటి ఎన్నికల్లో చదువుకున్న అభ్యర్థులకు ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చాం. కేబినెట్ లో 17 మంది కొత్తవారికి అవకాశం ఇచ్చాం. 7 మంది మొదటిసారి గెలిచి...మొదటి సారి మంత్రులు అయ్యారు. యువతకు టీడీపీ ప్రాధాన్యం ఇస్తుంది. బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తుంది. పామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం. కుప్పంలో నాకు సామాజికవర్గం లేదు..వెనకబడిన వర్గాలే నా సామాజిక వర్గం లేదు. 8 మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చాం. నాలుగో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాను. మొదటి పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టును సందర్శించాను...రెండో పర్యటన రాష్ట్ర భవిష్యత్తు అయిన అమరావతిలో పర్యటించాను. ఆ తర్వాత అసెంబ్లీ, కేబినెట్ సమావేశాలు పెట్టుకున్నాం. నా ప్రత్యక్ష దేవుళ్లు అయిన కుప్పం ప్రజలను కలవడానికి వచ్చాను.

### ఐదేళ్ల వైసీపీ పాలన ఓ పీడకల

"2019 నుండి 2024 వరకు ఒక పీడకల. ఐదేళ్లు అరాచకం సృష్టించారు...దౌర్జన్యాలు చేశారు. నా జోలికే వచ్చారు. అన్నాక్యాంటీన్ పెట్టి అన్నం పెట్టాలనుకుంటే వైసీపీ నేతలు దౌర్జన్యం చేశారు. కుప్పంలో గ్రానైట్ మొత్తం తినేసి కేజీఎఫ్ తలపించేలా దోపిడీ చేశారు. నేను కుప్పం వస్తున్నానంటే జీవో-1 ద్వారా మన వాళ్లపై దాడులు చేసి కేసులు పెట్టారు...30 మందిని జైల్లో పెట్టారు. ఇది నేను మర్చిపోతానా.? నాకు ఎవరిపైనా కోపం లేదు...కుప్పం ప్రజలపై ప్రేమ మాత్రమే ఉంది. ఎన్టీఆర్ విగ్రహం సాక్షిగా చెప్తున్నా...కుప్పంలో రౌడీ యిజం చేస్తే అదే చివరి రోజు. రౌడీ యిజం, గంజాయి కుప్పంలో ఉండటానికి వీలులేదు. కుప్పం మున్సిపాలిటీలో పన్నులు పెంచారు తప్ప అభివృద్ధి లేదు. మోడల్ మున్సిపాలిటీగా కుప్పంను మార్చుతాం. ఔటర్ రింగ్ రోడ్ వేస్తా. నాలుగు మండల కేంద్రాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

### కుప్పంలో ప్రతి ఎకరాకు నీళ్లందిస్తాం

రూ.2 లకే 20 లీటర్లు నీళ్లు ఇస్తే దాన్ని కూడా నాశనం చేశారు. కుళాయి ద్వార ప్రతి ఇంటికి నీళ్లు అందిస్తా. హంద్రీనీవా కాలువను ఎన్టీఆర్ ప్రారంభించారు. నేను వి.కోట వరకు నీళ్లు తెచ్చాను. 5 ఏళ్లలో వైసీపీ హయాంలో 5 కి.మీ మేర కూడా నీళ్ల తీసుకురాలేదు. సినీ సెట్టింగులు పెట్టి ట్యాంకర్లలో నీళ్లు తెచ్చి కాల్వలో పోశారు. వైసీపీకి ఏమాత్రం రైతులపై ప్రేమ లేదు. అన్ని సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం అయ్యాయి. త్వరలోనే సాగునీటి ప్రాజెక్టుల దుస్థితిపై శ్వేత పత్రం విడుదల చేస్తాను. హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులు నింపి కుప్పంలో కరవు అన్నది లేకుండా చేస్తాం. యామిగానిపల్లె, మనమాదన పల్లెలో రెండు చెరువులు నిర్మించి టీఎంసీ మేర నీటిని నింపుతాం. చెక్ డ్యాములు నిర్మించి నీళ్లు నిల్వ చేస్తాం. అవసరమైతే లిఫ్ట్ లు పెట్టి పొలాలకు నీళ్లు ఇస్తాం. సాగునీళ్లు ఇస్తే ఇక్కడి రైతులు బంగారం పండిస్తారు..ఇక్కడ అన్ని రకాల పంటలు పండిస్తారు. కుప్పం పట్టు పరిశ్రమకు కేంద్ర బిందువు. ఇక్కడ విమానశ్రయ







నిర్మాణాన్ని చేపడితే దుర్మార్గులు నిలిపేశారు. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. కుప్పం ఏరియా డెవలెప్మెంట్ అథారిటీ మళ్లీ ఏర్పాటు చేస్తాను. మల్లనూరు, రాళ్లమదుగూరును మండలాలుగా చేస్తున్నాం. కృష్ణగరి, కేజీఎఫ్, బెంగళూరు, చెన్నై కుప్పం దగ్గరగా ఉంటుంది...అభివృద్ధి చేసుకోవడానికి బ్రహ్మాండంగా ఉంటుంది." అని సీఎం చంద్రబాబు అన్నారు.

### 7 అంశాలపై త్వరలో శ్వేత పత్రాలు

యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత నాది. కుప్పంకు టెక్స్ టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, వివిధ రకాల పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయి. ద్రవిడ యూనివర్సిటీపై దృష్టి పెట్టి ప్రక్షాళన చేస్తా. యూనివర్సిటీ సిబ్బందికి జీతాలు సరిగా ఇవ్వడం లేదు...జీతాలు కూడా విడుదల చేయిస్తా. ఎడ్యుకేషన్ హబ్ గా కుప్పంను మార్చుతాం. మనం కట్టిన కమ్యూనిటీ భవనాలను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది...వాటిని పూర్తి చేస్తాం. తిరుపతి గంగమ్మ, నల్లప్ప కొండ గేటురాయిస్వామి ఆలయం, కోదండ రామాలయం, ధర్మరాజుల ఆలయాలను అభివృద్ధి చేస్తాం. వైసీపీ నేతలు గంజాయిని కూడా పెరట్లో పెంచారు...గంజాయి సరఫరాపై ఉక్కు పాదం మోపుతాం. వైసీపీ అరాచకాలు చూసిన ప్రజలు కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గాజువాక, బీమిలి, మంగళగిరిలో 90 వేలకు పైగా మెజారిటీని ప్రజలు కూటమి అభ్యర్థులకు ఇచ్చారు. పవన్ కళ్యాణ్ కూడా భారీ మెజారిటీతో గెలిచారు.. త్వరలో 7 అంశాలపై శ్వేత పత్రాలు విడుదల చేయబోతున్నాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

### పాసుపుస్తకాలపై జగన్ ఫోటో తొలగించి..రాజముద్ర వేస్తాం

"16,347 పోస్టుల భర్తీకి ఇచ్చిన మాట ప్రకారం సంతకం చేశాం...కేబినెట్ లో కూడా ఆమోదం తెలిపాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి పట్టాదారుపుస్తకాలపై బొమ్మలు ముద్రించుకున్నారు. టైటిల్ రిజిస్ట్రేటర్ ను పెట్టుకుని భూములు దోచుకోవాలని చూశారు. అందుకే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేసేందుకు కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నాం. పాసుపుస్తకాలపై జగన్ ఫోటో తొలగించి..రాజముద్ర వేసి పుస్తకాలు రైతులకు అందిస్తామన్నారు.

### రాజధాని నిర్మాణానికి విరాళాలు

అమరావతి రాజధానికి పలువురు విరాళాలు అందించారు. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబుకు విరాళాలకు సంబంధించిన చెక్కులను అందించారు. చిత్తూరు జిల్లా డ్వాక్రా సంఘాల తరపున రూ.4.5 కోట్లు, రామకుప్పంకు చెందిన టీడీపీ నేత ఆనందరెడ్డి రూ.5 లక్షలు, కుప్పంకు చెందిన ప్రేమ్ కుమార్ రూ.లక్షను విరాళంగా అందించారు. సందర్భంగా వారిని సీఎం చంద్రబాబు అభినందించారు.



## జిల్లా పేరు ను "వైఎస్ఆర్ కడప"జిల్లా గా మార్చాలి



ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): జిల్లా పేరులో కడప అనే పదాన్ని పునరుద్ధరించి, జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లా గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మార్పు చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన సమితి సభ్యులతో కలిసి ఈ విషయమై ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కడప అనేది తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కి తొలి ప్రవేశ ద్వారం కాబట్టి, వేల సంవత్సరాల ఘనమైన చరిత్ర ని కాపాడవల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజల అందరి మీద ఉంది అని వివరించడం జరిగింది. జిల్లా ప్రజల యొక్క ఆకాంక్ష అని, విషయాన్ని ముఖ్యమంత్రికి దృష్టి కి తీసుకువచ్చి, జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లా గా మార్పు చెయ్యటానికి తన వంతు కృషి చేస్తానని శాసన సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మేశ్వర్ కుమార్, డాక్టర్ శంకర్ రెడ్డి, ప్రముఖ కవి జింకా సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# రెండు స్కూటర్లు ఢీ..!

### -ఇరువురికి గాయాలు

దువ్వూరు, సూర్య వాస్తవం: మండల కేంద్రమైన దువ్వూరులోని కర్నూలు –కడప జాతీయ రహదారి సమీపంలోని క్రీస్తు రాజు పురం వద్ద రెండు స్కూటర్లు ఢీకొన్నాయి రెండు స్కూటర్లలో ఉన్నవారు కి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం పనిమీద దువ్వూరికి వచ్చి దువ్వూరు నుంచి గొల్లపల్లి కు వెళుతున్న భూమిరెడ్డి పల్లె వీరారెడ్డి, మోటార్ సైకిల్ లో వెళుతుండగా, గుడిపాడు నుంచి దువ్వూరికి వస్తున్న దువ్వూరు గ్రామానికి చెందిన షాబీర్ క్రీస్తు రాజు పురం సమీపంలో రెండు స్కూటర్లు ఢీకొని ఇరువురికి గాయాలు అయ్యాయి . వారిని వెంటనే దువ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి అనంతరం 108 ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చారు.





## మా ఎంపీలు పార్టీని వీడే అవకాశం లేదు

### -కడప ఎంపీ అవినాశ్ రెడ్డి



కడప బ్యూరో సూర్య వాస్తవం: వైసీపీ ఎంపీలు పార్టీ మారుతారంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని కడప ఎంపీ అవినాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన ఎంపీలు పార్టీ మారే అవకాశం లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు నీతులు చెబుతూనే వైసీపీ సానుభూతి పరులపై, నాయకులపై, కార్యకర్తలపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు తాము ఎవరిపై దాడులు చేయలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరవయ్యాయని ఆయన పేర్కొన్నారు.

# ఆక్రమించి భూమిని దర్జాగా అనుభవిస్తున్న ప్రబుద్ధులు

### -పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలిపిన ఫలితం శూన్యం, రిటైర్డ్ ఆర్మీ జవాన్

రైల్వే కోడూరు/ఓబులవారిపల్లె (సూర్య వాస్తవం)రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలంలో చెన్న రాజు పోడు గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 956/1. 5 ఎకరాల 33 సెంట్లు మామిడి తోటను పగడాల శశికాంత్ అనే వ్యక్తి దౌర్జన్యంగా పంట పండిన సాగును మామిడి తోటను స్వాధీనం చేసుకుని పలు రకాల ఇక్కట్లకు గురి చేస్తున్నాడని రిటైర్డ్ జవాన్ వెంకట్రామరాజు విలేకరుల వద్ద బోరున విలపించారు. ఆయన వివరాల మేరకు గత 23 సంవత్సరాల క్రితం లో 5. ఎకరాల 33 సెంట్లు లో టేకు మామిడి బోరు మోటరు అన్ని తన కూతురు అయిన లక్ష్మీ జోష్నాకు ఇచ్చానని, అయితే తాను విదేశాలలో ఉన్న సందర్భంలో తన కూతురు కూడా హైదరాబాదు నందు ఉన్న సందర్భంలో ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు చెందిన అల్లుడు దౌర్జన్యంగా మామిడి తోటను ఆక్రమించి పంటను కోసుకొని వెళుతున్నాడని, వెంకట రామరాజు తెలిపారు. దీనిపై స్థానిక కోడూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన పట్టించుకునే పరిస్థితి లేదని అదే విధంగా తాసిల్దార్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేస్తే ఎటువంటి



చర్యలు చేపట్టలేదని వెంకట రామరాజు ఆవేదన చెందారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తన కూతురికి చెందిన 5.33 మామిడి తోటను తిరిగి అప్పగించాలని, లేని పక్షంలో ప్రజాసంఘాలతో ఉద్యమాలను లేవదీస్తానని ఆయన విలేకరులకు తెలిపారు.

## ఇటుక బట్టీల పొగతో ప్రమాదం



లేపాక్షి(సూర్య వాస్తవం) హిందూపురం జాతీయ రహదారి గలిబిపల్లి క్రాస్వద్ద ఇటుకల భట్టీని ఏర్పాటు చేశారు. అయితే ఇటుకల భట్టీ నుంచి వెలువడే పొగ వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు అధికారల దృష్టికి తీసుకెళ్లినా నివారణ చర్యలు చేపట్టలేదని వాపోయారు. అంతేకాక ఈ పొగవల్ల గలిబిపల్లి, బిసలమానేపల్లి రైతులు పంటలు సరిగా పండక నష్టపోతున్నామన్నారు.

# మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమం



బంగారుపాళ్యం సూర్య వాస్తవం: బంగారుపాళ్యం మండలం తగ్గువారి పల్లి గ్రామపంచాయతీలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చంగల్రాయన్ ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జూన్ 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు హాస్టల్ వార్డెన్లు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మలేరియా ఆఫీసు నుండి సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూ సాహెబ్ హాజరై హాస్టల్స్ వార్డెన్స్ కు నోటీసులు ఇవ్వడం జరిగింది. హాస్టల్స్ లో కిటికీలకు మెస్ కొట్టుకోవాలని డెంగ్యూ మలేరియా సీజన్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పీరూ సాహెబ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ విషయంలో ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు. మంగళవారం ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి లోహిత్ చంగల్ రాయన్, జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూ సాహెబ్, మండల ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, సిహెచ్ వోలు దిలీప్, ఏఎన్ఎం రోజా రమణి, హాస్టల్ వార్డెన్స్ గీత, వెంకటసుబ్బయ్య, పల్లవి,వినాయకం, ఆశా కార్యకర్తలు పుణ్యవతి, ఏఎన్ఎంలు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రవణా నక్షత్రం సందర్భంగా వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): శ్రీమహావిష్ణువు వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఆలయాలలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. బొల్లవరం లోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో, పాత మార్కెట్ లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో, లలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి (అన్నా చెల్లెలు) ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రాతఃకాలం నుండే విశేష గోక్షీర, పంచామృత అభిషేకాలు, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, మహా నివేదనం, మహా మంగళహారతి నిర్వహించారు. కాగా రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మహిళలచే కుంకుమార్చన నిర్వహించారు. పాల్గొన్న భక్తాదులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.



## విద్య పైన శ్రద్ధ ఏది?

**పోరుమామిళ్ల సూర్య వాస్తవం :** ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంగా పనిచేయాలి అంటే సరియైన విద్యా విజ్ఞానం ఉండాలి అని రాజకీయ తత్వవేత్తలు ఏనాడో తెలిపారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో విద్య పైన శ్రద్ధ ఏమైనా ఉందా పాలకులకు. ప్రాచీన భారతదేశంలో విద్య అంటే విలువలు, నీతి నియమాలు, ధర్మాధర్మాలు, సాంప్రదాయాలు ఆచారాలను ఆధారంగా చేసుకుని బోధించేవాళ్లు. నేడు విద్యా విధానంలో ప్రపంచ స్థాయి పోకడలతో శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశం ఎంతో పురోభివృద్ధి చెందుతూ ఉన్న, నైతికంగా వెనుకబడుతున్నామనే దాంట్లో సందేహం లేదు. ఈనాడు విద్య అనేది వ్యాపార వస్తువుగా మారిపోయింది. చదువు కొనే పరిస్థితుల్లో ఒక సాధారణ వ్యక్తి లేకుండా పోయాడు. విద్య అనేది ఒక ఖరీదైన వస్తువుగా మారిపోయింది. కార్పొరేట్ ప్రైవేటు విద్యావిధానాల వల్ల గ్రామాలలో పిల్లలు ఉండడం లేదు అంటే పరిస్థితిని మనం అంచనా వేయవచ్చు. ప్రతిరోజు గ్రామాల నుండి పిల్లలు పట్టణాలకు చేరుకొని ఉదయం బడివేల నుండి సాయంత్రం బడి మోగేసేంతవరకు పాఠశాలలో ఉండి, సాయంత్రం మళ్ళీ ఇంటికి చేరుకోవడం. అంటే ఉదయం 9 నుండి సాయంత్రం ఐదు వరకు గ్రామాలలో బడి ఈడు పిల్లలు కనిపించరు అనేది వాస్తవం. వారిది ఒక వలస జీవనం అయిపోయింది. మరి గ్రామాలలో పాఠశాలలు లేవా? అందులో ఉపాధ్యాయులు లేరా? వసతులు ఏమైనా కరువయ్యా? మరి ఎందుకు ఇలాంటి పరిస్థితి దొరుకుతుంది అని ఆలోచించే పరిస్థితి గానీ సమయం గానీ మన నాయకులకు పాలకులకు లేకపోవడం దారుణం. ప్రభుత్వ పాఠశాలలన్నీ నిర్వీర్యం అయిపోతుంటే, ప్రైవేటు వ్యవస్థ విద్యను వ్యాపారం చేసుకుంటూ ఉంటే ప్రభుత్వాలు చూస్తూ మిన్నుకుంటున్నాయి తప్ప, విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొని రావాలి, విలువలతో కూడిన శాస్త్రీయ విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని స్పృహ లేకపోవడం ఎంత విచారం.ప్రభుత్వాలు మారినప్పుడల్లా సరికొత్త విద్యా విధానం, పాఠ్యప్రణాళికలలో ఎన్నో మార్పులు అంగన్వాడిని మొదలుకొని ఉన్నత స్థాయి విద్య వరకు ఎన్నో ప్రక్షాళన చేసాము అని, విద్యా విధానం అమలుపరిస్తే ఆచరణలో అవి సాధ్యపడక ఏదో ఒకలా విద్యా సంవత్సరాన్ని ముగించే పరిస్థితి ఈరోజు ఏర్పడింది. ప్రతిరోజు పట్టణాల నుండి పల్లెలకు బస్సులు వచ్చి పిల్లలను తీసుకుని వెళ్లి, పిల్లలని మళ్ళీ పట్టణాల నుండి గ్రామాలకు చేర్చే విద్యా విధానంలో మార్పులు రావాలి. పిల్లవాడు ఏ ఊరిలో నివసిస్తున్నాడు అతనికి అందుబాటులోనే పాఠశాల ఉండాలి. అలాంటి బడులను బలోపేతం చేసే దానికోసం ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రపంచంలోని దేశాలు విద్య కోసం అత్యంత కేటాయింపులు చేస్తే, మన దేశంలో ఇంకా ప్రైవేటు విద్యా విధానం పైన ఆధారపడుతూ ఉండడం కొంత కలత చెందాల్సిన విషయమే. పుస్తకాలకు, యూనిఫామ్ అంటూ,రకరకాల ఫీజులు అంటూ సగటు విద్యార్థిని దోచుకుంటున్నన్నారు. కనీసం ప్రాథమిక అవసరం విద్య పైన శ్రద్ధ చూపకపోతే నష్టపోయేది సగటు మనిషికి అని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎమర్జెన్సీ టైం లో ఇందిరాగాంధీని వ్యతిరేకించిన మోహనరావు కు సన్మానం



**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీని వ్యతిరేకించిన మోహనరావును బుధవారం భారతీయ జనతా పార్టీ ప్రొద్దుటూరు నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి టౌన్ అధ్యక్షుడు వంకధార నరేంద్ర రావు మాట్లాడుతూ 1975 జూన్ 25వ తేదీన అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీని ప్రకటించిన నేపథ్యంలో ఆ ఎమర్జెన్సీకి వీరు వ్యతిరేకంగా మోహన్ రావు పోరాటం చేశారని, అప్పుడు ఆయనను అరెస్టు చేసి జైల్లో పెట్టారని, కడప జైల్లో ఆయన దాదాపుగా నూరు రోజులు పాటు ఉన్నారని, ఆ టైంలో ఆర్ఎస్ఎస్ నాయకులు ఇంకా వ్యతిరేకంగా ఉధృతంగా పోరాటం చేయడంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని తీసేశారని వివరించారు. ఈ తరుణంలో ఆయనను సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు నలదిమ్మె కుమారి, ప్రధాన కార్యదర్శి పరమేశ్వరరావు, బిజెపి నాయకులు పాతకోట రాఘవేంద్రారెడ్డి, రవితేజ, శ్రీశ్రీ, హరికృష్ణ, మాజీ అసెంబ్లీ కన్వీనర్ మోత్కూరు వెంకటరమణ మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సారైటీ డిప్లొమా విద్యార్థుల ప్రతిభ

**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** ఏపి ఎస్.బి.టిఈటి మార్చి, ఏప్రిల్ 2024లో డిప్లొమా సెకండియర్ 4వ సెమిస్టరుకు నిర్వహించిన పరిక్షా ఫలితాలలో ఎస్సారైటీ విద్యార్థులు చక్కని ఫలితాలతో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ ఫలితాలలో సివిల్ విభాగంలో ప్రయోగ 96.00%, బాబా మహమ్మద్ బాష 82.60%, ఈఈఈ విభాగంలో కిరణ్ కుమార్ 93.10%., వెంకట కళ్యాణ్ 93.10%, రాజుకుమార్ రెడ్డి 87.80%, భార్గవి 84.20%, ఈసిఈ విభాగంలో పవిత్ర 96.80%, నాగ సుచరిత 96.00%, స్వర్ణలత 95.30% శాతం మార్కులు సాధించి కళాశాల మొదటి, రెండు, మూడవ స్థానాలు దక్కించుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా పరిక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీరకళ్యాన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఓడిలు అభినందించారు.

# చేనేత వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకములు ప్రారంభం





**కడప సూర్య వాస్తవం:** జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి / సహాయ సంచాలకులు, జి నాగరాజు రావు వారి ఆధ్వర్యములో 25-06-2024 నుండి 01-07-2024 తేది వరకు (07 రోజులు) "నేఫ్ నామ్ ఖాస్ కళాక్షేత్రం", మహిళ పోలీస్ స్టేషన్ దగ్గర, కడప పట్టణం నందు "బయర్స్ - సెల్లర్స్ మీట్ (చేనేత వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకములు జరుగును. ఈ వస్త్ర ప్రదర్శనను ప్రారంభించబడును. ఈ ప్రదర్శనను జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సుభాషిని ప్రారంభించారు. ఏడి నాగరాజు రావు మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రదర్శన నందు రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన వివిధ జిల్లాల కాటన్ మరియు పట్టు వస్త్రాలతో పాటు, మెర్సెరైజ్డ్, పట్టు టై %డ% డై చీరలు, సికో చీరలు, ధర్మవరం, గద్వాల్, ఉప్పాడ మరియు పోచంపల్లి పట్టు చీరలు, మాధవరం, వెంకటగిరి కాటన్ చీరలు, మంగళగిరి డ్రస్ మెటీరియల్, బందర్ జరీ చీరలు, జమదాని చీరలు, షర్టింగ్స్, కలంకారీ వస్త్రాలు, పొందూరు ఖద్దరు, సిల్క్ షర్టింగ్స్, మరియు ప్రఖ్యాతి గాంచిన ఎమ్మిగనూరు బెడ్ షీట్స్, లుంగీలు, డ్రస్ మెటీరియల్స్, మరియు ఇంకా పేరెన్నికగన్న ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు సందర్శకులకు అందు బాటు లో ఉంటాయి అన్నారు . ఈ ప్రదర్శనకు ఇతర వస్తువులు ఉచితంగా సహకరించిన సిఆర్ఐ సునీల్ అన్నారు.రాష్ట్రం నలు మూలల నుండి దాదాపు (20) చేనేత సహకార సంఘముల ఉత్పత్తి దారులు పాల్గొననున్నారు. ఈ వస్త్ర ప్రదర్శన లో ఉత్పత్తి ధరలకే అమ్మకం జరుపబడును.ఈ కార్యక్రమంలో జౌలి శాఖ కృష్ణ డివో, అహ్మద్ డివో, శేషాగిరి ఏ డి ఓ, నారపరెడ్డి ఏడిఓ, నారాయణమ్మ, వనిత మరియుప్రజలు పాల్గొన్నారు.



## వాలంటీర్లకు ఇచ్చిన మాట తప్పుతారా?

(మొదటి పేజీ తరువాయి)తెరలేచింది. చంద్రబాబు కేబినెట్ మొదటిసారి సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా సామాజిక పింఛన్లను గతంలో మాదిరిగానే ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే చిన్న మార్పు గతంలో వాలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీన సూర్యోదయం కాకుండానే నిద్రలేపి మరీ పింఛన్లు పంపిణీ చేసేవారు. ఈ దఫా సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వాలంటీర్ వ్యవస్థ కొనసాగడంపై చర్చ మొదలైంది. ఉగాది పర్వదినం పురస్కరించుకుని వాలంటీర్లకు నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. వాలంటీర్ల వ్యవస్థ కొనసాగించడంతో పాటు ఇప్పుడిస్తున్న దాన్ని రెట్టింపు చేసి, అంటే నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని చంద్రబాబు గొప్పగా చెప్పారు. బాబు చెబితే చేస్తారని వాలంటీర్లు నమ్మారు. టీడీపీ సోషల్ మీడియా ఇదే విషయాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సర్కార్ కొలువుదీరిన తర్వాత మొదటి కేబినెట్ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అనే ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ సమావేశంలో వాలంటీర్ల ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ అడుగులు చూస్తుంటే వాలంటీర్ వ్యవస్థను లేపేసేలా కనిపిస్తోందనే చర్చకు తెరలేచింది. వాలంటీర్ వ్యవస్థతో రాజకీయంగా నష్టం జరుగుతుందనే భయమే చంద్రబాబు సర్కార్ వెనకడుగు వేసేందుకు దారి తీసేలా వుంది. జగన్ ప్రభుత్వం ప్రతీది వాలంటీర్లకు అప్పగించి, కేడర్ ను విస్మరించిందనే విమర్శ బలంగా వినిపిస్తోంది. వైసీపీ అనుభవాల్ని గుణపాఠంగా తీసుకుని, వాలంటీర్ వ్యవస్థపై వేటు వేసే అవకాశం వుందని అంటున్నారు. చంద్రబాబు సీఎం అయితే తమకు రూ.10 వేలు వస్తుందని చాలా మంది వాలంటీర్లు కొండంత ఆశ పెట్టుకున్నారు. రూ.10 వేలు జీతం అంతా ఉత్తుత్తిదేనా అని వాలంటీర్లు నసుగుతున్నారు. వాలంటీర్ వ్యవస్థ అనేది వైఎస్ జగన్ బ్రెయిన్ చైల్డ్ అంతకు ముందు చంద్రబాబు జన్మభూమి కమిటీలు వుండేవి. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికలో ఆ కమిటీల ప్రభావం వుండేది. వాలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ఆన్ లైన్ టెక్నాలజీని వాడుకుని, వీలయినంత ట్రాన్స్ పెరెంట్ గా లబ్ధిదారులను ఎంపిక చేసారు. అయితే ఎక్కువ మంది వాలంటీర్లు వైసీపీ నేతల సిఫార్సులతో ఉద్యోగాలు పొందినవారే అన్నది వాస్తవం. పని చేసే వారు ఎవరైనా వాలంటీర్ వ్యవస్థ వల్ల జనాలకు అయితే మంచే జరిగింది. ఇళ్ల దగ్గరకే వాలంటీర్లు వచ్చారు. పొలాల దగ్గరకే వాలంటీర్లు వచ్చారు. అయితే రాజకీయంగా వాలంటీర్ వ్యవస్థ కాస్త అప్రతిష్ట మూటకట్టుకుంది. ఎన్నికల ముందు రాజీనామాలు చేయడం, అంతకు ముందు వాలంటర్లలో కొంత మంది చేసిన తప్పుడు పనులు ఇలా కొన్ని వివాదాలు నెలకొన్నాయి. వాటి సంగతి పక్కన పెడితే వాలంటీర్ వ్యవస్థ ను గాడిలో పెడితే మాత్రం జనాలకు పక్కాగా ఉపయోగపడేదే. ఎన్నికల ముందు అవసరం కోసం కావచ్చు, మరే ఇతర రాజకీయ పరమైన కారణాల వల్ల కావచ్చు వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, పదివేలు జీతం చేస్తామని చంద్రబాబు మాట ఇచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత రాజీనామా చేసిన వాలంటీర్లు ఆందోళన చెందడం మొదలుపెట్టారు. ఇలాంటి నేపథ్యంలో ఈ నెల 1న పింఛన్ల పంపిణీ వాలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎందుకిలా? అన్నది క్లారిటీ లేదు. నిజానికి పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది సరిపోరు. పైగా చాలా వరకు సచివాలయ సిబ్బంది నాన్ లోకల్స్. అంటే ఆయా గ్రామాల్లో వుండే వారు కాదు. వారికి వీధులు, ఇళ్లు, జనాలు పరిచయం తక్కువ. ఇప్పుడు వృద్దులను సచివాలయాలకు రప్పించి పంపిణీ చేసే అవకాశమే ఎక్కువ వుంటుంది. పొలం పాకల దగ్గరకు, ఇళ్లకు వెళ్లే అవకాశం తక్కువ వుంటుంది. దీన్ని బట్టి చూస్తుంటే వాలంటీర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది. ఎవరెవరు వాలంటీర్లు, వారి నేపథ్యం, అర్హతలు అన్నీ చూసుకుని, వున్నవారు ఎందరు, రాజీనామా చేసిన వారు ఎందరు, అసలు ఎందరు అవసరం పడతారు.. ఇలా అన్నీ ఓ అవగాహన వచ్చాక కానీ ఈ వ్యవస్థ మీద ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకునే అవకాశం తక్కువ. వాలంటీర్ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసి కొత్తగా టీడీపీ నాయకులు సూచించిన వారికే వాలంటీర్లుగా నియమించిన తర్వాతే వాలంటీర్ల జీతాల పెంపు ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు.

## డయేరియా నియంత్రణపై అప్రమత్తగా ఉండాలి : కడప కమిషనర్

(మొదటి పేజీ తరువాయి)శానిటేషన్ విభాగ అధికారులను ఆదేశించారు. కడప నగరం నందు ఎటువంటి కేసులో వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన క్యాంపెయిన్లను చేయు విధంగా చర్యలు తీసుకుంటూ ప్రతి పాఠశాల నందు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చేతులను శుభ్రంగా ఉంచుకునేలా చూసుకోవాలని పెద్ద కాలువలు మరియు చిన్న కాలువలను ఎప్పటికప్పుడు తీసివేస్తూ శుభ్రం చేయాలని సేనిటేషన్ విభాగ అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారులకు డయేరియా సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. న్యాయ పద్ధతిలో పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. పరిష్కారం నందు ఎటువంటి అలస్యం చూపరాదని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా శాఖాధిపతులకు సూచించారు.

## గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపిడిఓ ఉమా మహేశ్వర రావు




**సిద్దవటం సూర్య వాస్తవం :** గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఓ ఉమా మహేశ్వర రావు తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం ఎంపిడిఓ సభా భవనంలో మంగళ వారం ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అభి వృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మంచి నీటి సమస్యలు లేకుండా పంచాయతీ కార్య దర్శు లు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో ఆయా గ్రామ పంచాయతీలలోని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. సిద్దవటం సీహెచ్సీ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అతిసారావల్లమరణాలుసంభవించాయని, అతి సారా వ్యాధి ప్రభలుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అతిసారా లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్సీలకువెళ్లాలని డాక్టర్ సూచించారు. ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి 100 రోజుల్లో తేడా చూస్తారన్నారు. ప్రజలకు మంచి నీరు ఇవ్వండి. మౌళిక వసతులు కల్పించండి మండల పరిషత్ నుంచి నిధులు ఇస్తామన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలు తెలపాలని ప్రజలకు మెరుగైన పాలనను అందిస్తాం.ఎంపీపీప్రతినిధిపంచాయతీ కార్యదర్శు లకు సూచనలు చేశారు. వెలుగుపల్లి లో మంచి నీటిసమస్యఉన్నట్లుసార్వత్రిక ఎన్నికల సమయంలో తన దృష్టికి వచ్చిందన్నారు. మెటల్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి గత ప్రభు త్వానికి ఈ ప్రభుత్వానికి అభివృద్ధి పనుల్లో 10 రోజుల్లోనే తేడా చూపించండి. చేసే ఉద్యోగానికి న్యాయంచేయాలనిసూచించారు. ఈకార్యక్ర మంలో హౌసింగ్ఏఈచెన్నయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఈఓపీఆర్డీలక్ష్మినరసయ్య,పంచాయతీ కార్య దర్శులు,ఇంజనీరింగ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్లు



**లేపాక్షి (సూర్యవాస్తవం):** ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని సోమవారం ఆరు మంది ఐఎఎస్ సబ్ కలెక్టర్లు సందర్శించారు. ఆలయ అర్చకులు నరసింహాశర్మ, శ్రీనివాసరావులు ఆలయ చరిత్రను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కళ్యాణ మండపం, సీతాదేవిపాదం, వేలాడే స్థంభం, నాట్యమండపాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆ నాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన



**అనంతపురం వైద్యం (సూర్య వాస్తవం) :** జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇటీవల విడుదల చేసినఓ సర్క్యులర్ కలకలం రేపింది. ప్రభుత్వా సుపత్రిలో గత కొద్ది సంవ్సరాలుగా ఔట్ సోర్సింగ్ లో చేస్తున్న ఉద్యోగుల సర్టిఫికెట్ల వెరిఫికే షన్ చేయాలని ప్రిన్సిపాల్ డా. మానిక్యరావు సర్క్యులర్ జారి చేశారు. వివరాలలోకి వెళితే ఔట్ సోర్సింగ్‌లో కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి. ఔట్ సోర్సింగ్ నియమాలకు విరుద్ధంగా ఇతర ప్రాంత ఇతర రాష్ట్ర నివాసితులను ఎటువంటి నియమాలు పాటించకుండా ఔట్ సోర్సింగ్‌లోకి విలీనం చేశారని అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. కొంత మంది ఉద్యోగులు తమ కు ఉద్యోగానికి తగ్గ విద్యార్హత మరియు ఆర్డర్ కాపీ లు కూడా లేకుండా ఔట్ సోర్సంగ్ లోకి విలీనం చేశారని దీనివలన లోకల్ అభ్యర్థులకు అవకా శాలు కోల్పోయారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మెడికల్ కళాశాల అనంతపురం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. మాణిక్యరావు దృష్టికి వెళ్ళటంతో ఈ విషయం పై అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అవకతవకలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది . అవినీతి పై ఉపేక్షించేది లేదంటూ పూర్తి ప్రభుత్వ నియమాలు పాటించాలి అని వీటిపై పునః పరిశీలన చేయాలని ఓ సర్క్యులర్ జారి చేశారు. ప్రభుత్వ జీవో 607,712,82 క్రింద పనిచేస్తున్న ఔట్ సోర్సంగ్ ఉద్యోగుల వయసు ధ్రువీకరణ పత్రాలు మరియు ఉద్యోగానికి సరిపడ విద్యార్హత సర్టిఫికెట్లు,లోకల్ సర్టిఫికెట్లు ,రోస్టర్ పాయింట్ల వివరాలతో పాటు కార్యాలయానికి తక్షణమే అందించాలని సర్క్యులర్ జారి చేశారు. గతం లో జరిగిన తప్పులను సరిదిద్ది గాడిన పడిన కళాశాల యంత్రాంగం మరియు సంబంధిత డిపార్ట్మెంట్ లను క్రమబద్దీకణకు శ్రీకారం చుట్టారు. ఇతర రాష్ట్ర అభ్యర్థులు కు అవకాశాలు ఇవ్వటం పై లోకల్ అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ కళాశాల యంత్రాంగం నిర్లక్ష్యమా లేక గత ప్రభుత్వ పెద్దల సహకారమా అనేది ప్రశ్నార్థకంగా మారింది . ఇకనైనా తప్పులను సరిదిద్దుతారో లేదో వేచి చూడాలి.


OFFICE OF THE PRINCIPAL, GOVERNMENT MEDICAL COLLEGE: ANANTAPUR

Rc.No. Spl / E3/ GMC ATP/ 2024 Dated: 20.06.2024

CIRCULAR

Sub:-GMC, Anantapur – Out-Sourcing Staff -submission of Dt of Birth Proof along with educational qualifications –instructions issued- Reg.

Ref:- 1.C.No 18650003/ ME/ 2024 Dated 29.03.2024 of The Director Of Medical Education A.P.Vijayawada.
2.G.o.Ms No 607 HM & FW (E1) dept Dt 21.06.2001
3.G.O.Ms No 712 Finance (SMPC) Dept Dt 30.07.2002
4.G.O.Ms No 82,Finance (SMPC) Dt 31.03.2005

&&&&

All the out-sourcing Employees working under the control of Addl D.M.E./Principal Govt Medical College,Anantapuramu are herewith instructed to submit the 10th Class certificate for the Purpose of Dt of Birth Proof and also to submit theirl educational qualification certificates to that post for verification along with their appointment orders.

" This may be treated as most urgent "

//Attested//

Assistant Director(Admn)

Sd/- Dr.S.Manikhya Rao, MD., Addl. DME/Principal, Govt. Medical College, Anantapur.

- వయసు, తగిన విద్యార్హత కొరకు పునః పరిశీలన
- జీ.ఓ నంబరు 607 ,712, 82 క్రింద పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది
- ఔట్ సోర్సింగ్ నియమాలు ఉల్లంఘించి కొంత మంది ఉద్యోగులను ఔట్ సోర్సింగ్‌లోకి విలీనం
- సరైన అపాయింట్మెంట్ ఆర్డర్లు కూడా లేకుండా పనిచేస్తున్నారని అనుమానాలు వ్యక్తం
- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమా లేక గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలా అనేది తెలియాల్సి వుంది
- తప్పులను ఉపేక్షించేది లేదంటూ తక్షణమే పూర్తి వివరాలు అందించాలని సర్క్యులర్ జారి చేసిన ప్రిన్సిపాల్ డా.మాణిక్యరావు

## దళిత మిత్ర సంఘం రాష్ట్ర 7వ మహాసభను జయప్రదం చేయండి



**లక్కిరెడ్డిపల్లె సూర్యవాస్తవం :** జూలైలో జరగబోవు దళిత మిత్ర సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. మంగళవారం అనంతపురం గ్రామం లో జిల్లా విస్తృతస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగుల సమస్యల కోసం జూలై 21న కడప ప్రెస్ క్లబ్ హాల్ నందు రాష్ట్ర మహాసభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక,సామాజిక, రాజకీయ, ఆత్మగౌరవం, చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూమిలేని దళిత బడుగు బలహీన వర్గాల వారికి మూడు ఎకరాలు భూ పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు. ఎస్సీ,ఎస్టీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన భూములకు ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేసుకోకుండా శాశ్వతంగా పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఎస్సీ,ఎస్టీకార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి 75 శాతం సబ్సిడీతో 20 లక్షల వరకు షూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పేద విద్యార్థు లకు డిగ్రీ నుండి పీజీ వరకు పెంచి వారికి అవకాశాలు కల్పించాలి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శంకరన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, మహిళాఅధ్యక్షురాలుబుజ్జమ్మ, మండల అధ్యక్షులు రెడ్డప్ప ,సంఘం నాయ కులుకేశవ,మల్లేష్,రామ్మోహన్,భాస్కర్,ఆంజనేయులు,రమేష్ పాల్గొన్నారు.

# హంద్రీనీవా కాలువను పరిశీలించిన బాబు

### ముఖ్యమంత్రి చూసేందుకు భారీగా తరలి వచ్చిన ప్రజానీకం – చంద్రబాబును సరిగా చూడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేసిన ప్రజలు



**శాంతిపురం సూర్యవాస్తవం :** కుప్పం నియోజకవర్గ రెండు రోజుల్లో పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి రోజు పి ఈ ఎస్ కళాశాలలలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ చేరుకుని అక్కడ నుండి ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గం ద్వారా శాంతిపురం మండల పరిధిలోని జల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి వద్ద ఉన్న హంద్రీనీవా కాలువను పరిశీలించారు. చంద్రబాబు కోసం వేచి ఉన్న ప్రజల అభిమానులు చంద్రబాబును సరిగా చూడ లేక పోయామని ఆవేదన చెందారు, భద్రత దృష్ట్యా చంద్రబాబు బస్సు నుండి అక్కడికి విచ్చేసిన ప్రజలు అభిమానులు కార్యకర్తలకు అభివాదం తెలుపుతూ ముందుకు సాగారు. తుమిసి వద్ద ముఖ్యమంత్రి ప్రజలను కలిసేందుకు ప్రత్యేక వాహనం నుండి దిగి ప్రజల సమస్యలను ఆలకించారు. సిఎంకు విభిన్న ప్రతిభా వంతురాలు చైతన్య తనకు గుండె, కిడ్నీ ప్రాబ్లం ఉందని ముఖ్యమంత్రికి విన్నవించుకోగా మహిళ కు సహాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కడపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న తన సొంత నివాసం నిర్మాణ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రిగా తన సొంత నియోజకవర్గానికి వచ్చిన నారా చంద్రబాబు నాయుడునుచూసేందుకుదారిపొడవునా ఆయన అభిమా నులు ద్విచక్ర వాహనాలతో సందడి చేశారు. అభిమా నులు ముఖ్యమంత్రి వెంట తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు రాష్ట్ర సమన్వయ కమిటీ కార్యదర్శి డాక్టర్ సురేష్ రాష్ట్ర మంత్రులు, జిల్లా ఎమ్మెల్యే లు అమర్ నాథ్ రెడ్డి,పులివర్తి నాని, బొజ్జల సుధీర్, గురజాల మోహన్, నేతలు సిఆర్ రాజన్, గాజుల ఖాదర్ భాషా,శాంతిపురం




మండల నాయకులు పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు మాజీ పార్టీ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి చలపతి స్వామి విజయ్ కుమార్ ఆర్ఎస్ మణి నాగరాజు కేశవులు మాజీ ఎంపీటీసీశ్రీరాములుబిఆర్‌లోకేష్ బి వి సుధాకర్ కృష్ణారెడ్డి ఎంపీటీసీనామాలప్ప గోవిందరాజులు ఉయ్యాల జయరాం రెడ్డిరామచంద్రనాయుడురాజన్నబసవరాజువాజిద్ అనసూ యకళావతి సుగుణమ్మ శ్యామల కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను వెంటనే తగ్గించాలి

సిపిఎం డిమాండ్





**అనంతపురం క్రైం (సూర్య వాస్తవం) :** ఆకాశాన్ని అందుతున్న నిత్యావసర సరుకుల ధరలను, కూరగాయ ధరలను వెంటనే తగ్గించాలని టవర్ క్లాక్ దగ్గర సిపిఎం పార్టీ ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో కూరగాయలను మెడలో తగిలించుకొనివినూత్నంగానిరసన కార్యక్రమం చేపట్టారు. కూరగాయలను ,నిత్యావసర ధరలను వేలాడదీసి సామాన్యులకు అందుబాటులో లేకుండా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నారని చెప్పారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా పరిపాలన చేస్తున్న నిత్యవసర సరుకులు ధరలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైనదని ఇది కార్పొరేటీకరణ ప్రభుత్వమని పెట్టుబడుదారుల కు ఊడిగం చేయడమే నరేంద్ర మోడీకి తెలుసని విమర్శించారు. కూరగాయ ధరలను చూస్తే రైతులు పంట పహ పండించినప్పుడు అమాంతంగా రేట్లు పడిపోయి తాము పండించిన పంటలను కొనేవారు లేక గిట్టుబాటు ధర లేక రోడ్లపై వేసి తమ నిరసన తెలియజేసిన ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాలు పోలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు కొందరు కార్పొరేటర్లు నూతన టెక్నాలజీని ఉపయోగించు కొని పంటలను పండించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాళ్లు చేస్తున్నటువంటి మోసాలు అరికట్టలేక తెల్ల మొహం వేసుకుని చూస్తున్నారని తెలిపారు. రైతులను వ్యవసాయం నుండి దూరం చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ విధంగా అన్యాయం చేస్తుందని చెప్పారు .రైతులు పంటలు పండించిన గిట్టుబాటు ధర రాదని నిర్ణయించుకొని రైతులు వ్యవసాయం నుండి దూరం అవుతున్నారని కానీ కొందరు వ్యాపారులు అమాంతంగా రేట్లు పెంచి మళ్లీ రైతులను ఆశ పుట్టిస్తున్నారని పాపం రైతులు మళ్లీ అప్పులు చేసి వ్యవసాయం లో నష్టపోతున్నారని విమర్శించారు. అందుకే రైతులు చెబుతున్న విధంగా ప్రతి పంటకు రేటును పంట పెట్టడానికి ముందే ప్రభుత్వం నిర్ణయించాలని ఆ విధంగా చేసినప్పుడు మాత్రమే రైతులకు, కొనుగోలుదారులకు లాభం కలుగుతుందని తెలిపారు. కానీ ప్రభుత్వాలు ఈ విధంగా చేయడానికి భయపడుతున్నాయని కారణం ఇవి కార్పోరేట్ల మీద, పెట్టుబడిదారుల మీద ఆధారపడి ఉన్నాయని విమర్శించారు . ఇప్పటికైనా ప్రభుత్వాలు కోల్డ్ స్టోరేజ్, గోడౌన్లో వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచిన నిత్యవసర సరుకులను బయటకు తీయాలని తెలిపారు. కూరగాయలను రైతు బజార్లలో ప్రభుత్వమే తక్కువ ధరలకు విక్రయించాలని కోరారు.బ్లాక్ మార్కెట్లలో అమ్ము తున్న వ్యాపారస్తులను కఠినంగా శిక్షించాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలీ, బాలకృష్ణ ,మసూద్, సీనా, ఎర్రి స్వామి, నూరుల్లా, లక్ష్మీనారాయణ, డేవిడ్, మురళి , మహదేవ్ నగర్ వెంకట,ఇస్మాయిల్ ,మాబ్బీ, లాలెమ్మ, గులాబ్, శంషాద్, పీరా, లక్ష్మీనారాయణ , బాదుషా, మహేంద్ర, బేల్దారు బాబు తదితరులు పాల్గొన్నారు

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



**మైదుకూరు సూర్య వాస్తవం :**
మైదుకూరు మండలం ఎంఈఓ పద్మలతకి వినతి పత్రం అందజేసిన ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి జగదీష్ మరియు నాగరాజుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు మండలంలోని అనుమతులు లేని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అదే విధంగా మండలం లోని ప్రైవేటు విద్యాసంస్థల్లో ధనార్జనే ధ్యేయంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తూ నడుపుతున్నటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు అదే విధంగా మండలంలో గుర్తింపు లేని పాఠశాలలు రోజురోజుకీ విస్తరిస్తూ ఉన్నాయి. అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు హెచ్చరించారు అలాగే అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల దగ్గర నుంచి వేలకు వేల రూపాయలు అడ్మిషన్ ఫీజు అని పాఠశాల ఫీజు అని బుక్స్ ఫీజులు బిల్డింగ్ ఫీజ్ అని రాపడుతున్నటువంటి ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు అంతేకాకుండా ప్రవేట్ మండలంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలల్లో ఏటువంటి ఫైర్ పర్మిషన్ లేకుండా నడుపుతున్నటు వంటి పాఠశాలలపై మరియు ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్నటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. అలాగే కొన్ని పాఠశాలలు టెక్నో స్కూల్స్ ,ఈ టెక్నో స్కూల్స్ ,మెడికల్, ఐఐటి జేఈఈ మెయిన్స్, అనే పేర్లతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ ఉన్నాయి వీటి పై తక్షణం స్పందించి వాటి గుర్తింపు రద్దు చేయాలని వారి డిమాండ్ చేశారు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నటువంటి పాఠశాల పైన చర్య తీసుకోవాలి లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామనివారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

– ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు



**అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) :**
అనంతపురం నగరంలో స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనం నందు ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ఆఫీస్ బరేర్స్ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాబు మాట్లాడుతూ కాకినాడలో జులై 8 9 10 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు రాజకీయాల పైన ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని తెలిపారు. కేవలం చదివే కాకుండా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సమాజంలో విద్యావ్యవస్థలో జరుగుతున్నటువంటి అవినీతిని వెలికితీయడానికి, అవినీతి అక్రమాల పైన పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రంలో విద్యా రంగంలో వస్తున్న మార్పులపై సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విద్యార్థులలో చైతన్యం నింపడానికి విద్యార్థుల శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల దృష్టిని ఆలోచించి తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలను ప్రస్తుతం అధికారంలోకి రావడంతో విద్యార్థుల హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్లైన్ విధానంలో కొనసాగించాలని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షను రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 5045 పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్లో ఉన్న విద్యా దీవెన వసతి దీవెన మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. కాకినాడలో జరుగుతున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థులు లోకానికి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణయ్య కుల్లాయి స్వామి జిల్లా కోశాధికారి హనుమంతు జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహ యాదవ్ వెంకట్ నాయక్ ఆంజనేయులు వంశీ తదితరులు పాల్గొన్నారు

# మల్లికార్జున మరణం బాధాకరం

- జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ
- జెడ్పీ ఉద్యోగి భౌతికకాయం సందర్శన
- పూలమాలలతో ఘన నివాళి
- నిబద్ధత గల ఉద్యోగిని కోల్పోయాం
- ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన
- బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చిన గిరిజమ్మ



**అనంతపురం క్రైం (సూర్య వాస్తవం) :** గుండెపోటుతో మరణించిన జెడ్పీ ఉద్యోగి మల్లికార్జున మృతదేహాన్ని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ సందర్శించారు. మల్లి భౌతికకాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జున మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మరణించారని తెలియగానే వెంటనే ఆమె అనంతపురంలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఘటన ఎలా జరిగిందని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ కు బయకుదేరిన మల్లికార్జున భార్య ఒడిలోనే ప్రాణాలొదిలినట్లు తెలుసుకొని గిరిజమ్మ దిగ్ర్భాంతికి గురయ్యారు. ఈ ఘటన చాలా బాధాకరమని, తనను కలచివేసిందన్నారు. విధి నిర్వహణలో మల్లికార్జున అందరితో మంచిగా మెలిగేవారని పేర్కొన్నారు. తాము ఒక మంచి ఉద్యోగిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆమె భగవంతుడ్ని కోరుకున్నారు. ఆ తరువాత మల్లికార్జున కుటుంబ సభ్యులను గిరిజమ్మ ఓదార్చారు. అధైర్యపడొద్దు..అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ వెంట అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, జెడ్పీ సిబ్బంది ఉన్నారు.



# పద్మశ్రీ విద్యా సేవలు మరువలేనివి

– ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ

**పత్తికొండ (సూర్యవాస్తవం) :** పత్తికొండ పట్టణంలో ఉన్న స్థానిక జిల్లా పరిషత్ బాలకల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు పద్మశ్రీ పదవీ విరమణ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపధ్యాయురాలు భ్రమరాంబ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అయినా పద్మశ్రీ దంపతులను ఉపాధ్యాయిని బృందం వివిధ తరగతి విద్యార్థినిలు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ప్రధానోపాధ్యాయరాలు భ్రమరాంబ మాట్లాడుతూ పద్మశ్రీ విద్యార్థులకు అందించిన విద్యాసేవలు మరువలేనివి అని వృత్తి పట్ల అంకిత భావం అమోఘం అపూర్వం అని కొనియాడారు.ఆమె ఎంతో మంది విద్యార్థులను తన ఉద్యోగ ప్రయాణంలో తీర్చి దిద్దారు అన్నారు.ఆమే ఎందరో ఉపాధ్యాయులకు ఆదర్శం అన్నారు.ఈ కార్యక్రమంలోపాఠశాలఉపాధ్యాయబృందంవిద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



# తేలికపాటి వర్షానికి చెరువులను తలపిస్తున్న పలు వీధులు

## కొత్త ప్రభుత్వంలోనైనా రోడ్లు బాగుపడేనా..– కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నివాస ప్రాంతల ప్రజలు




**నల్లచెరువు (సూర్య వాస్తవం) :** మండల కేంద్రంలో తేలికపాటి వర్షానికే పలు వీధులు అద్వానంగా తయార య్యాయి.చిన్న తేలికపాటి వర్షానికే వీధులు మొత్తం చెరువులను తలపిస్తున్నాయి.గత ప్రభుత్వంలో ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వీధులలో ప్రజా ప్రతినిధులు కొన్ని రోడ్లు అయితే వేశారు కానీ కొన్ని చోట్ల మాత్రం తమకు పట్టి పట్టనట్లు వ్యవహరి ంచిన తీరు మండల వ్యాప్తంగా చర్చనీ యాంకంగా మారింది.మండల కేంద్రం లోని గ్రామీణ బ్యాంక్ వీధి మొత్తం తేలికపాటి వర్షానికి చెరువును తలపి స్తోంది. మండల కేంద్రంలో ప్రధాన బ్యాంక్ అయిన గ్రామీణ బ్యాంకుకు నిత్యం ఖాతాదారులు ప్రజలు వస్తూ వెళ్తూ ఉంటారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వీధి మొత్తం చెరువును తలపిస్తుంటే ఖాతాదారులు వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని జెండా వేపమాను వీధి, చిన్న వర్షానికి చిత్తడి చిత్తడిగా తయారైంది.దీని కారణంగా వీధి ప్రజలు ఇళ్లలో నుండి బయటికి రావాలన్నా బయట నుండి ఇంట్లోకి వెళ్లాలన్న తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలో పలు వీధులు సైతం చెరువులను తలపిస్తున్నాయి.బస్టాండ్ కూడలి నుండి నల్లచెరువు పాత ఊరుకు వెళ్ళు రహదారిలో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా చిన్న వర్షానికే వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో బాటసారులు, వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మండల కేంద్రంలోని ఈద్గా వీధి, బీసీ కాలనీ, విజయలక్ష్మి కాలనీ, పంచాయతీ వీధి తదితర వీధుల పరిస్థితి మరి అద్వానంగా తయారైంది.దీని కారణంగా వీధులలోని ప్రజలు పడదానికి పాట్లు పడుతున్నారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది ప్రజాప్రతినిధులు అధికారులు మారిన మా వీధుల గోడును పట్టించుకునే నాధుడే లేదని కాలనీవాసులు వాపోతున్నారు.ఎన్నికల ముందు అది చేస్తాం ఇది చేస్తామని వేదికలెక్కి గగ్గోలు పెట్టిన నాయకులు ఎన్నికల అనంతరం ఇటువైపు కన్నెత్తి కూడా చూడ టం లేదని మండిపడు తున్నారు.గత ప్రభుత్వంలో నాయకులకు ప్రజాప్రతితులకు అనుకూలంగా ఉన్న వీధులలో మాత్రం రోడ్లు వేశారని పలువురు వాపోతున్నారు. కనీసం కొత్త ప్రభుత్వంలోనైనా రోడ్లు బాగుపడతాయా లేదా అని కోటి ఆశలతో పలు వీధుల ప్రజలు ఎదురు చూ స్తున్నారు. సంబంధింత అధికార ప్రజా ప్రతినిధులు నాయకులు స్పందించి ఈ ప్రభుత్వంలోనైనా రోడ్లు బాగుపరచాలని పలువురు కోరుతున్నారు.

# నవోదయ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో రెయిన్బో స్కూల్ విద్యార్థి విజయకేతనం



**మైదుకూరు సూర్య వాస్తవం :** నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్షల లో వివిధ క్యాటగిర్లకు ఎంట్రన్స్ పరీ క్షలు జరగగా కేవలం ఓసి క్యాటగిరీ లో ఒక సీట్ ఉన్నప్పటికీ ఆ ఒక్క సీటును కైవసం చేసుకున్న రెయిన్బో స్కూల్ విద్యార్థి. ఎన్ వి స్వాతిక్ రెడ్డి. ఒక నవోదయ పరీక్ష కాదు ఎలాంటి పోటీ పరీక్షల్లో అయినా విజయం సాధించడంలో రెయిన్బో స్కూల్ విద్యార్థుల తర్వాతే మరి ఎవరైనా అని గతంలో అనేకసార్లు అనేక పోటీ పరీక్షల్లో విజయాలు సాధించి ఇప్పుడు జరిగిన నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్షలలో సీట్ కైవసం చేసుకున్న రెయిన్బో స్కూల్ విద్యార్థిని. రెయిన్బో విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ తవ్వా సుధాకర్ రెడ్డి గారు విద్యార్థిని అభినందించడం జరిగింది. నవోదయ పరీక్ష ఫలితాల్లో సీటు. సాధించిన విద్యార్థిని.స్కూలు యాజ మాన్యంతో పాటు ఉపాధ్యాయుల బృందం అభినందించడమే పాటు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా రెయిన్బో స్కూల్ కర స్పాండెంట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ పోటీ పరీక్ష ఏదైనా. విజయం రెయిన్బో స్కూల్ విద్యార్థు లేదేని ఆయన ధీమా వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందం మాట్లాడుతూ స్కూ లుకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థిని అభినందించడం జరిగింది.

# జెడ్పీ ఉద్యోగి ఆకస్మిక మృతి



**అనంతపురం (సూర్య వాస్తవం) :** జిల్లా పరిషత్ ఉద్యోగి మల్లికార్జున మంగళవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మరణించారు. గుండె పోటుతో ఆయన మరణించినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆయన బత్తలపల్లి మం డల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ పని చే స్తూనే డిప్యుటేషన్ పై జెడ్పీకి వచ్చి పూర్వ సీఈఓ సీసీగా పని చేశారు. ఆ తరువాత డిప్యుటేషన్ రద్దు చేసుకుని తిరిగి బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్గా వెళ్లిపోయారు. సోమవారం రాత్రి కొంచెం అస్వస్థతకు గురైనట్లు బంధువులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున వాకింగ్ కు వెళ్లేందుకు సిద్ధమైన ఆయన.. ఎందుకో గుండె పట్టుకున్నట్లు ఉందంటూ భార్యకు చెప్పి.. ఆమె ఒళ్లో నిద్రపో యినట్లు తెలుస్తోంది. భార్య ఒడిలోనే ఆయన తుది శ్వాస వదిలారు. ఆయన ఎక్కడ పని చేసినా అందరితో కలివిడిగా, కలు పుగోలుగా ఉండేవారు. మృదు స్వభావిగా ఆయనకు మంచి పేరుంది. మలికార్జున గుండెపోటుతో మరణించారని తెలిసి జెడ్పీ ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు.ఈఘటన జెడ్పీ ఉద్యోగుల్లో విషాదం మిగిల్చింది.

# దిగువ మాఘం ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞం



**తవణంపల్లి సూర్య వాస్తవం:** తవణంపల్లి మండలం దిగువ మాఘం గ్రామంలో ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉమా పతి రెడ్డి పాల్గొన్నారు. ఉమాపతి రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21 నుండి హరికథ 26వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు మహాభారత వీధి నాటకం నిర్వహిస్తు న్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం హరికథ భాగవతారిని ఎన్. సుమతి హార్మోనియం నాగార్జున తబలా సుధాకర్ హరికథా కాలక్షేపాన్ని నిర్వహించగా, తిరుపత్తూర్ వరలక్ష్మి నారాయణ నాట్య మండలి మేనేజర్లు ఎం. పెరు మాళ్ పి. పరమశివం బి. మోహన్ దాస్ ఆధ్వర్యంలో రాత్రి తమిళ వీధి నాటకాన్ని నిర్వహిస్తు న్నామన్నారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క ఘట్టాన్ని రసవత్తరంగా కళాకారులు అలరి స్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో మంగళ తోరణాలతో అత్యంత వైభవంగా అలంకరించా మన్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి : డాక్టర్ ఖాదర్



**చెన్నెకొత్తపల్లి (సూర్యవాస్తవం):** ప్రకృతిలో సంభవించే వాతావరణ మార్పుల కారణంగా వాతావరణ వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడాపురం ప్రభుత్వ యునాని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఖాదర్ అన్నారు . మంగళవారం స్థానిక దళితవాడలోని అంగన్వాడీ కేంద్రం నందు అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని నీటి నిల్వలను తొలగించు కోవాలని పరిసరాల చుట్టూ వీధులలో సున్నపు పొడి బ్లీచింగ్ పౌడర్ చల్లుకోవాలని వీధులలో మురుగునీటిది తొలగించు కోవాలి, ఎక్కువ రోజులు నీరు నిలుపుకుంటే ఆ నీటి లో దోమలు నిలువలుం టాయని తద్వారా జబ్బులు వచ్చే అవకాశం ఉంటుందనారు విధిగా ప్రతి ఇంటిలో దోమతెరలు వాడాలన్నారు అన్నారు. ప్రతిరోజు వీధులను నివాసగృహాల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇందుకోసం దోమల నివారణపొగనుస్ప్రేచేయించు కోవా లి, బ్లీచింగ్ పౌడర్ చల్లుకోవా లని సూచించారు. పరిసరాలు పరి శు భ్రతచర్యలుపాటించకపోవడం అదే విధంగావ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. పరిసరాలపరిశుభ్రత పాటించని యెడల మలేరియా డెంగ్యూ డయేరియా ఇంటెక్ జ్వరం వంటి వ్యాధులు సోకుతా అన్నారు ప్రతి ఒక్కరూ పరిసరాలను శు భ్రంగాఉంచుకోవాలి,రోగాలకుదూరంగా ఉండాలని ముందు జాగ్రత్త చర్యలు తీసు కునిరోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటిం చాలనిడాక్టర్ ఖాదర్ కాలనీవాసులకువిజ్ఞప్తిచేశారు. ఎవరికైనా జ్వరము వస్తేఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు .ఈ అవగాహన కార్యక్రమానికి దాదాపు 40 మంది స్థానికులు హాజరయ్యారు.




# చంద్రబాబు తొలిరోజు కుప్పం పర్యటన సక్సెస్

**– రెండు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**– ఘన స్వాగతం పలికిన రాష్ట్ర రవాణా ,క్రీడల శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి**



**శాంతిపురం సూర్య వాస్తవం :** 2024 ఎన్నికల లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా సొంత జిల్లా,సొంత నియోజకవర్గమైన కుప్పం రెండు రోజుల పర్యటన కు మంగళవారం మధ్యాహ్నం పి ఈ ఎస్ మెడికల్ కళాశాల నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అనంతపురం రేంజి డిఐజి. షిమోషి,జిల్లా ఎస్పీ మణికంఠ చెందొలు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మె ల్యేలు పలమనేరు అమర్నాథ్ రెడ్డి,చిత్తూరు. గురుజాల జగన్మోహన్,గంగాధర్ నెల్లూరు, థామస్ నగరి గాలి భాను ప్రకాష్.సత్యవేడు కోనేటి ఆదిమూలం, చంద్రగిరి, పులవర్తి వెంకటప్రసాద్ మాజీ ఎమ్మెల్సీ రాజసిం హులు, గౌనివారి శ్రీనివాసులు,మాజీ ఎమ్మెల్యేలు సి.కె .జయ చంద్ర రెడ్డి,(సి.కె.బాబు) సుగుణమ్మ, బాబు,గాంధీ, పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా బాబు రెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయ కులు సి ఆర్ రాజన్,నరసింహా యాదవ్, హేమలత,శ్రీధర్ డాక్టర్ సురేష్ పిఎస్ మణిరత్నం సత్యేంద్ర ,జిల్లా అధికా రులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ అభి మానులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.